www.prajasakti.com
ప్రజాశక్తి
మంగళవారం 1 ఏప్రిల్ 2025
5
తిరుపతి



తిరువణ్ణామలై చేరిన 'సైకిల్‌యాత్ర'

ప్రజాశక్తి- తిరుపతి బ్యూరో

వేలూరులో ...

తిరుపతి నుంచి మధురైకి బయల్దేరిన మతసామరస్య సిపిఎం సైకిల్ యాత్ర తమిళనాడు రాష్ట్రం తిరువణ్ణామలైకి సోమవారం రాత్రికి చేరుకుంది. శుక్రవారం ప్రారంభమైన ఈ యాత్ర చిత్తూరు, వేలూరు జిల్లాల మీదుగా 200 కిలోమీటర్లు సాగింది. మండుటెండలో సీనియర్ కామ్రేడ్లు చల్లా వెంకటయ్య, కుప్పస్వామి చేస్తున్న ఈ యాత్రకు అడుగడుగునా ఆదరణ లభిస్తోంది. పార్టీ అభిమానులు, కార్యకర్తలు వారికి జెండాలతో స్వాగతం పలుకుతున్నారు. వేలూరు సిపిఎం జిల్లా కార్యదర్శి శంకరి, కార్యదర్శివర్గ సభ్యులు దయానిధి ఘనంగా యాత్రకు స్వాగతం పలికి, శాలువతో సత్కరించారు.

గడ్డి 'గిరాకీ'

పశుగ్రాసం ధరలతో బెంబేలు
ట్రాక్టర్ గడ్డి రూ.15వేల పైమాటే
పశుపోషకందారుల ఆవేదన

ప్రజాశక్తి - శ్రీకాళహస్తి రూరల్

గ్రామాల్లో నివసించే ప్రతి ఒక్కరికీ పంటలు పండించడానికి సాగుభూమి ఉండదు. కొంతమంది రైతులకు మాత్రమే ఎంతో కొంత భూమి ఉంటుంది. ఆ భూమిలో కూడా సాగు చేయడానికి రైతులు పడే కష్టాలు వర్ణనాతీతం. భూమి ఉన్న రైతులకు సాగునీరు అందక ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటుంటారు. తీరా కష్టపడి పండించిన పంటలను అమ్మడానికి పోతే గిట్టుబాటు ధరలు ఉండవు. పంటలు పండించే రైతులు పరిస్థితి చూస్తే ఇలా ఉంటే సాగు భూమిలేని రైతులు చాలామంది ఉన్నారు. వీరిలో ఎక్కువ శాతం మంది పశువుల పెంపకం మీద ఆధారపడి జీవిస్తుంటారు. ఈ పశువుల పెంపకం వలన వచ్చే డబ్బులతోనే చాలీచాలని బతుకును వెల్లదీస్తున్నారు. ఈ చాలీచాలక వచ్చే డబ్బులతో కుటుంబ పోషణ, వారి పిల్లలను చదివించుకోవడం పశువుల పోషక దారులకు ఎంతో ప్రయాసతో కూడిన పని. ఇదిలా ఉంటే ఈ సంవత్సరం మార్చి మాసంలోనే భానుడి ప్రతాపం తీవ్రంగా ఉంది. పాడి రైతులు వారి గ్రామాల సమీపంలో ఉన్న ప్రాంతాల్లో ఉదయం నుంచి సాయంత్రం వరకు పశువులు మేత మేయడానికి తిప్పుతుంటారు. ఎండల ప్రభావం ఎక్కువ కావడంతో ఎక్కడా పచ్చగడ్డి కనపడే దాఖలాలు కనపడటం లేదు. దీంతో పాడి రైతులు పశువుల మేత కోసం వరిగడ్డిని తప్పక కొనాల్సిందే. వరిగడ్డి ధర ఏటేటా పెరిగే పరిస్థితి కానీ తగ్గిన పరిస్థితి కనబడటం లేదు.

మండలంలో మొత్తం 46 పంచాయతీలు ఉన్నాయి. మండలం మొత్తం మీద ఆవులు 19,216, బర్రెలు11,383, గొర్రెలు42,983, మేకలు12,216 ఉన్నట్లుగా అధికారులు చెబుతున్నారు. గత సంవత్సరం ఒక ట్రాక్టర్ వరి గడ్డి ధర సుమారు పదివేల రూపాయలు ఉంటే ఈ సంవత్సరం సుమారు 15 వేల రూపాయలు పలుకుతుంది. ఈ విధంగా ఏటేటా వరి గడ్డి ధరలు పెరుగుతూ ఉండటంతో పశు పోషక దారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రస్తుతం ఒక ఎకరా పొలంలో వరిగడ్డి కొనాలంటే ఒక ఎకరాకు రైతుకు మూడు వేల నుంచి 4000 రూపాయలు, గడ్డిని మిషన్ ద్వారా కట్టలు కట్టించడానికి ఒక కట్టకు 25 రూపాయలు, ట్రాక్టర్ బాడుగ కిలోమీటర్ల లెక్కన, పొలం నుంచి వరిగడ్డిని ట్రాక్టర్లు ఎక్కించి తిరిగి పాడి రైతు ఇంటి దగ్గర వాము వేయడానికి కూలీలకు సుమారు 3000 నుంచి 4000 రూపాయలు ఖర్చు అవుతుందని పాడి రైతులు చెబుతున్నారు. తౌడు 30 కేజీలు 900 రూపాయలు, పెసర పొట్టు 50 కేజీలు 1600 రూపాయలు, క్యాల్షియం క్యాను 1200 రూపాయలు చొప్పున కొని పశువులకు మేతగా అందించడం ఎంతో కష్టంగా మారిందని పాడి రైతులు ఆందోళన చెందుతున్నారు. పెరిగిన ధరల వలన కొన్ని గ్రామాల్లో పశువులను పోషించి వాటి ద్వారా వచ్చే ఆదాయం సరిపోక కూలి పనులకు వెళ్లిన పరిస్థితులు లేకపోలేదు.

పశుపోషణతో పాటు కూలికెళ్లాల్సిందే
పశు పోషక దారుడు టి.మునిస్వామి, ఎగువ వీధి

గతంలో పశువుల పెంపకం ద్వారా వచ్చే డబ్బులతో కుటుంబాన్ని పోషించుకునే వాళ్ళం. కానీ ఇప్పుడు పెరిగిన ధరలతో పశువులను పోషించడం చాలా ఇబ్బందిగా మారింది. మేతల ధరలు విపరీతంగా పెరగడం, పాలు ధరలు పెరగకపోవడంతో ఎన్నో వ్యయ ప్రయాసల మధ్య జీవిస్తున్నాము. ఇకనైనా ప్రభుత్వం స్పందించి పశువులకు అందించే మేతలను సబ్సిడీ ద్వారా అందించాలని కోరుతున్నాము.

పశువులకు పుష్కలంగా నీరు తాగించాలి : రవీంద్రవర్మ, పశువైద్యాధికారి

వేసవికాలంలో పాడి రైతులు తీసుకోవలసిన జాగ్రత్తలను గురించి తొండమనాడు పశు వైద్యాధికారి రవీంద్ర వర్మను వివరణ కోరగా వేసవి కాలంలో అధిక ఉష్ణోగ్రత వలన పశువులు బరువు తగ్గడం జరుగుతుంది. అలా జరగకుండా ఉండాలంటే పాడి రైతులు పశువులకు ఎక్కువగా నీరు తాగించాలి. అలాగే పచ్చిగడ్డి, దాణాలను మామూలు కంటే ఎక్కువ శాతం మేతగా అందించాలి. ఎండల వలన పశువుల్లో ఏదైనా మార్పులు కనిపిస్తే వెంటనే పశువైద్యశాల అధికారుల సూచనల మేరకు మందులు వాడాలి.

మానవత్వమే 'మతం'

దళిత, ముస్లింల ఇఫ్తార్ విందు

ఇఫ్తార్ విందులో దళితులు, ముస్లింలు

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

'కులాలు కూడు పెట్టవని, మతాలు మానవత్వం చూపవని, కులాన్ని మతాన్ని ఏ విధంగా అయితే మనం మందిరానికి మసీదుకు వెళ్లేటప్పుడు చెప్పులు బయట వదిలేస్తామో, అదేవిధంగా కులాన్ని మతాన్ని మన ఇంటి వరకు వదిలేసి, సమాజంలో మనమంతా మానవత్వంతో మెలగాలి. తద్వారా మన దేశ ప్రగతిని ప్రపంచ దేశాలకు చాటాలి. ప్రపంచ దేశాలు మన దేశాన్ని ఆదర్శంగా తీసుకోవాలి. భిన్నత్వంలో ఏకత్వం, సర్వమత సమానత్వమైన భారతదేశాన్ని చూసి ప్రతి ఒక్కరు నేర్చుకోవాలి' అని వక్తలు ఉద్ఘాటించారు. తిరుపతి జీవకోన మజీద్ ఏ మహమ్మదీయలో దళిత ముస్లిం ఆదివారం ఇఫ్తార్ విందు నిర్వహించింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథులుగా పాల్గొన్న ఆంధ్రప్రదేశ్ బిషప్ కౌన్సిల్ చైర్మన్ ఎలమంచిలి ప్రవీణ్, భారతీయ దళిత సాహిత్య అకాడమీ రాష్ట్ర అధ్యక్షులు ధర శేఖర్, బీసీకే పార్టీ జిల్లా అధ్యక్షులు బోకం రమేష్, ఎంజెఏసీ జాతీయ అధ్యక్షులు రఫీ హిందుస్తానీ, తిరుపతి ఈద్గా వైస్ చైర్మన్ మొహమ్మద్ అలీ మాట్లాడుతూ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ హజ్రత్ మొహమ్మద్ మొహాని 1949లో మొట్టమొదట దళిత ముస్లిం ఇఫ్తార్ విందు ప్రారంభించారని గుర్తు చేశారు. వారినీ అనుసరిస్తూ తిరుపతిలోని జీవకోనలో మసీద్ ఏ మహమ్మదీయులో ప్రతి సంవత్సరం రంజాన్ చివరి వారంలో దళిత ముస్లింల ఇఫ్తార్ విందు చేపట్టడం జరుగుతుంది. దీని ముఖ్య ఉద్దేశం కులం, మతం, జాతి వివక్ష లేకుండా మానవత్వంతో ప్రతి ఒక్కరూ సోదర భావంతో సమానత్వంతో మెలగాలన్నారు.

మంగళం పరిధిలో మదీనా మస్జీద్‌లో మస్జిద్ ముత్తువల్లి మహబూబ్ పీరా, సెంట్రింగ్ చాన్ బాషా, మెడికల్ చాన్ భాషా పాల్గొన్నారు.


తిరుపతిలో..

వక్ఫ్ చట్ట సవరణ నిరసిస్తూ నల్లరిబ్బన్లతో 'నమాజ్'

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

తిరుపతిలో సోమవారం రంజాన్ పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఎస్వీ యూనివర్సిటీ సమీపంలోని ఈద్గా మైదానంలో ముస్లిం సోదరులు ఉదయం 9 గంటలకు నమాజ్ చదివే సమయంలో వక్ఫ్ చట్ట సవరణకు వ్యతిరేకంగా చేతికి నల్ల రిబ్బన్లు ధరించి నమాజ్ చేశారు. ప్రార్థన సమయంలో తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, టిడిపి తిరుపతి మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యం, మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్లు ముద్ర నారాయణ, ఆర్ సి మునికష్ణ, కార్పొరేటర్ ఎస్కే బాబు, టిడిపి ముస్లిం మైనార్టీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎస్ మహబూబ్ బాషా, ఈద్గా మైదానం కమిటీ అధ్యక్షులు ఎస్ రఫీ, ప్రభుత్వ ఖాజీ సయ్యద్ షఫీ అహ్మద్ ఖాదరి, టిడిపి తిరుపతి పార్లమెంట్ అధ్యక్షులు నరసింహ యాదవ్, ముస్లింల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు జాఫర్ పులి ప్రార్థన సమయంలో ముస్లింల అభ్యున్నతికి ప్రసంగించారు. ఈ సందర్భంగా తిరుపతి ఎమ్మెల్యే ఆరు శ్రీనివాసులు మాట్లాడుతూ ఈద్గా మైదానం ముస్లిం సోదరులకు చెందడానికి తన వంతు కషి చేస్తానని చెప్పారు. ముస్లింల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు జాఫర్ పులి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ చట్ట సవరణకు వ్యతిరేకంగా పార్లమెంట్లో బిల్లును తీసుకువచ్చిందని, దాన్ని ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలని కోరారు.

కెవిపిఎస్ జిల్లాస్థాయి సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షులు నల్లప్ప

దళితులకు భూములు పంచాలి : కెవిపిఎస్

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

తిరుపతి జిల్లాలో భూమిలేని దళిత కుటుంబాలకు భూములు పంచాలని, జిల్లాలో ప్రభుత్వాలు మారినా దళితులపై దాడులు అరికట్టలేని పరిస్థితి ఉందని, వెంటనే దాడులు ఆపి రక్షణ కల్పించాలని కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు నల్లప్ప డిమాండ్ చేశారు. యశోదానగర్‌లోని వేమన విజ్ఞాన కేంద్రంలో ఎన్‌డి శ్రీనివాసులు అధ్యక్షతన కెవిపిఎస్ జిల్లా మహాసభ జరిగింది. నల్లప్ప మాట్లాడుతూ కెవిపిఎస్ దళితుల పక్షాన పోరాడుతుందని, దళితుల మధ్య చీలిక తెచ్చేలా పాలకులు అన్యాయం చేస్తున్నారన్నారు. జిల్లాలో నేటికీ కులవివక్ష విలయతాండవం చేస్తోందన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వందవాసి నాగరాజు మాట్లాడుతూ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో దళితులకు తీవ్రమైన అన్యాయం చేస్తున్నారన్నారు. దళితవాడల్లో ఇప్పటికీ శ్మశానాలు లేవన్నారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు అంగేరి పుల్లయ్య మాట్లాడుతూ ప్రైవేట్‌రంగంలోనూ దళితులకు రిజర్వేషన్లు కల్పించాలని, టిటిడిలో, కార్పొరేషన్‌లో, ఇతర డిపార్టుమెంట్లలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులను పర్మినెంట్ చేయాలన్నారు. కెవిపిఎస్ నాయకులు ఆర్.వెంకటేష్, అరుణాచలం, సంక్రాంతి వెంకటయ్య, పాకాల మధు, ఎన్.రఘు, చిరంజీవి, ప్రభాకర్, ప్రసాద్, బాలకృష్ణ పాల్గొన్నారు.

దేశాన్ని వెంటాడుతున్న నైపుణ్యాభివృద్ధి కొరత

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

దేశంలో నైపుణ్యాభివృద్ధి కొరత వెంటాడుతోందని, అవసరాన్ని బట్టి కాక, ఆదాయాన్ని బట్టి విద్యను అందించడం పరిపాటిగా మారిందని, ఈ ధోరణి ఇటీవల కాలంలో మరింత ప్రబలిందని వక్తలు అన్నారు. వేమన విజ్ఞాన కేంద్రంలో కంప్యూటర్ కేంద్రాన్ని ఆదివారం ప్రారంభించారు. 25 కంప్యూటర్లు అందుబాటులో ఉంటాయని, బుధవారం నుంచి కంప్యూటర్ శిక్షణ ప్రారంభమవుతుందని నిర్వాహకులు మల్లారపు నాగార్జున పేర్కొన్నారు. ఉదయం 8 గంటలకు టాలీ, సాయంత్రం 4-6, 6-8 మధ్య రెండు బ్యాచ్‌లకు ఆఫీసు, వర్డ్, ఎక్సెల్ కోర్సుల్లో నామమాత్రపు రుసుముతో శిక్షణ ఉంటుందని తెలిపారు.

కంప్యూటర్ కేంద్రాన్ని జిల్లా ఐదో అడిషనల్ కోర్టు జడ్జి జి.రామగోపాల్, కంప్యూటర్లను తిరుపతి ఐఐటి డైరెక్టర్ ప్రొఫెసర్ కెఎన్ సత్యనారాయణ ప్రారంభించారు. అనంతరం జరిగిన సభలో కెఎన్ సత్యనారాయణ మాట్లాడుతూ దేశంలో ఒక ఇంజినీరు ఉంటే, పది మంది డిప్లొమా హోల్డర్స్ ఉండాలని, ఒక డిప్లొమా హోల్డర్‌కు పది మంది ఐటిఐ నిపుణులు ఉండాలనేది విధానమని గుర్తు చేశారు. కానీ దేశంలో ఇందుకు భిన్నంగా కుప్పలు తెప్పలుగా ఇంజినీర్లు మార్కెట్లోకి వస్తున్నారని, ఐటిఐ, డిప్లొమా అర్హత ఉండాల్సిన నైపుణ్యం కలిగిన కార్మికుల కొరత విపరీతంగా పెరిగిందన్నారు.

రేపటి నుంచి కంప్యూటర్ శిక్షణ ప్రారంభం

జడ్జి రామ్ గోపాల్ ప్రసంగిస్తూ 75 ఏళ్ల రాజ్యాంగ అనుభవాలను క్రోడీకరించుకుంటే నేటికి అనేకమంది సామాజిక న్యాయానికి నోచుకోవడం లేదని, సామాజిక దక్పథం ఉన్నవారు పరిమితమవుతున్నారని, ఇలాంటి పరిస్థితుల్లో సమాజంలోని ఈతి బాధలను పట్టించుకునే వేమన విజ్ఞాన కేంద్రం లాంటి కేంద్రాల అవసరం ఎంతగానో ఉందని వివరించారు. వేమన విజ్ఞాన కేంద్రం నైపుణ్యాభివద్ధిలో అత్యున్నత ప్రమాణాలను సాధిస్తుందన్న ఆకాంక్షను జడ్జి రాంగోపాల్ వ్యక్తపరిచారు. ఈ కార్యక్రమానికి టెంకాయల దామోదరం అధ్యక్షత వహించారు. తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ మాజీ కార్యదర్శి జి. వెంకటనారాయణ, సోషల్ వెల్ఫేర్ డిపార్ట్మెంట్ డిప్యూటీ డైరెక్టర్ టి. విక్రమ్ రెడ్డి, సీనియర్ న్యాయవాది మట్టా పురుషోత్తం రెడ్డి, ఎలక్ట్రో స్టీల్ కాస్టింగ్ లిమిటెడ్ శ్రీకాళహస్తి జనరల్ మేనేజర్ దొరై రాజ్, ఉప విద్యాశాఖాధికారి బాలాజీ, ఎంబీ విజ్ఞాన కేంద్రం విజయవాడ బాధ్యులు పిన్నమనేని మురళీకష్ణ, పిచ్చాటూరు ఎంఈఓ హేమమాలిని పాల్గొన్నారు. కార్యక్రమాన్ని వేమన విజ్ఞాన కేంద్రం ప్రధాన కార్యదర్శి మల్లారపు నాగార్జున, ముఖేష్, ముని లక్ష్మి, తహిరున్నిసా, లక్ష్మీనారాయణ, రెడ్డప్ప, రఫీ, గురునాథం తదితరులు నిర్వహించారు.

వేమన విజ్ఞాన కేంద్రంలో కంప్యూటర్ శిక్షణ కేంద్రం ప్రారంభం

క్యూబాకు ప్రగతినగర్ వాసుల సంఘీభావం

ప్రజాశక్తి- తిరుపతి టౌన్

క్యూబా దేశాన్ని ఆర్థికంగా అమెరికా దేశం ఇబ్బందులకు గురిచేస్తుంది. క్యూబాను ఆదుకోవడం కోసం ప్రజల నుండి విరాళాలు సేకరించాలని సిఐటియు పిలుపునిచ్చిన నేపథ్యంలో సోమవారం పగతి నగర్ లో విరాళాల సేకరణ జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సిఐటియు జిల్లా కార్యదర్శి ఆర్ లక్ష్మి మాట్లాడుతూ క్యూబాలో కమ్యూనిస్టుల నేతత్వంలో సోషలిస్ట్ వ్యవస్థ కొనసాగుతోందని, దీన్ని జీర్ణించుకోలేని అమెరికా అనేక రకాల ఆంక్షలు విధించినప్పటికీ అగ్రగామి దేశంగా ఉన్న అమెరికాకు బెదరకుండా ప్రజలకు పాలన అందిస్తున్నారని తెలిపారు. క్యూబా లో నేటికీ విద్య, వైద్యం ఉచితంగా అందిస్తున్నారని పేర్కొన్నారు. క్యూబాకు అండగా నిలబడడానికి 95 ప్రపంచ దేశాలు ముందుకు వచ్చాయని అన్నారు. విరాళాలు ఇచ్చిన వారికి ఆర్.లక్ష్మి కృతజ్ఞతలు తెలిపారు.

డాక్టర్ జి.జగదీష్‌ను సత్కరించిన మారిషస్ ప్రధాని

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

మారిషస్ తెలుగు మహాసభ ఆధ్వర్యంలో శ్రీ విశ్వావసు నామ తెలుగు సంవత్సర ఉగాది వేడుకలు వైభవంగా నిర్వహించారు. మారిషస్ రాజధాని ఫీనిక్స్‌లోని ఇందిరా గాంధీ సెంటర్ ఫర్ ఇండియన్ కల్చర్ ఈ వేడుకలు చేశారు. శ్రీ విశ్వావసు నామ తెలుగు ఉగాదిని మారిషస్‌లోని తెలుగు వారు ఎంతో ఉత్సాహంగా జరుపుకున్నారు. ప్రపంచ ప్రఖ్యాత వైద్య నిపుణుడు డాక్టర్ గుడారు జగదీష్ వైద్య రంగంలో చేసిన అసాధారణ కషికి, ముఖ్యంగా వికలాంగుల శ్రేయస్సు కోసం వారి యొక్క అచంచలమైన అంకితభావానికి గుర్తింపుగా మారిషస్ ప్రధాన మంత్రి డాక్టర్ నవీన్‌చంద్ర రామ్ గూలమ్ సత్కరించారు. విశ్వ వైద్య దివ్యాంగబంధు అవార్డుతో సత్కరించారు. అమెరికా, జర్మనీ, ఇంగ్లాండు, ఇటలీ, ఫ్రాన్స్, నైజీరియా, కెన్యా, ఒమన్, స్విట్జర్లాండ్, మారిషస్‌లలోనూ ఉచిత క్యాంపులు నిర్వహించి తన సేవలను విస్తరించి, అనేక జాతీయ, అంతర్జాతీయ జర్నల్స్‌లో తన పరిశోధనలు ప్రచురించారని తెలిపారు. మారిషస్‌కు డాక్టర్ జగదీష్ తన సేవలను అందించాలని ప్రధాని కోరారు.

పింఛన్ పంపిణీకి సర్వం సిద్ధం : కలెక్టర్

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పెన్షన్లు ఏప్రిల్ 1 వ తారీఖున పంపిణీపై రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఉదయం 7 గంటల నుంచి లబ్ధిదారుల ఇంటి వద్దనే పెన్షన్ల పంపిణీ చేయాలని సచివాలయం సిబ్బందిని ఆదేశిస్తూ డిఎల్డిఓలను, ఎంపీడీవోలను, మున్సిపల్ కమిషనర్లను పర్యవేక్షించాలని ఆదేశిస్తూ, జిల్లాలో ఏప్రిల్ నెలకు సంబంధించిన 2,61,841 మంది ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత ఫించన్ దారులకు సుమారు 111.82 కోట్ల రూపాయలు పంపిణీకి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ ఎస్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అధికారులకు సూచిస్తూ ఏప్రిల్ 1 వ తారీఖున మంగళవారం పంపిణీ చేయవలసిన ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పెన్షన్ మొత్తాన్ని ఈ నెల మార్చి29 శనివారం నాడే సంబంధిత అధికారులు డ్రా చేసి సేఫ్ కస్టడీ లో ఉంచుకొన్నారని పేర్కొన్నారు.

హసీనా జాన్‌కు గౌరవ డాక్టరేట్

ప్రజాశక్తి- రేణిగుంట

రంగస్థల కళాకారిణిగా 35ఏళ్ల కృషి

ఆమెకు కళలన్నా, కళా రంగమన్నా, నటనన్నా, క్రీడలన్నా చాలా మక్కువ. బడి ఈడు నుంచే అటు క్రీడలు, ఇటు సాంస్కృతిక కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ అంచలంచెలుగా రాణిస్తూ వస్తున్నారు. వీక్షకులు, ప్రేక్షకుల నుంచి ప్రశంసలు, అవార్డులు, రివార్డులు అందుకుంటున్న రంగస్థల కళాకారిణి డాక్టర్ డి. హసీనా జాన్. ఉమ్మడి చిత్తూరు జిల్లా రేణిగుంటకు చెందిన డి. హసీనా జాన్ గత 35 ఏళ్లుగా సాంఘిక, జానపద, పౌరాణిక నాటికలు, నాటకాల్లో విభిన్న పాత్రల్లో నటిస్తూ, ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని నాటక సమాజాలకు సుపరిచితురాలైన రంగస్థల నటిగా ఆమె పేరు, ప్రఖ్యాతలు తెచ్చుకున్నారు.

ఓ నటిగా ఆమెకున్న ప్రతిభను గుర్తించిన ఏషియా ఇంటర్నేషనల్ కల్చరల్ అకాడమీ తమిళనాడు రాష్ట్రం, హొసూరులోని క్లరిష్ట ఫార్చ్యూన్ హోటల్ లో జరిగిన కార్యక్రమంలో ప్రముఖులు, అతిరథ మహారథుల సమక్షంలో గౌరవ డాక్టర్ రేట్ ప్రదానం చేశారు. ఈ సందర్భంగా గౌరవ డాక్టరేట్ గ్రహీత హసీనా మాట్లాడుతూ తాను ఓ నటిగా నాటక, బుల్లితెర, వెండితెర ప్రేక్షక, అభిమానులను సంపాదించుకుంటూ, నటనే తన జీవిత లక్ష్యంగా కొనసాగిస్తూ ఉమ్మడి చిత్తూరు జిల్లాలో డాక్టరేట్ అందుకున్న మొట్టమొదటి కళాకారిణి తాను కావడం తనకెంతో సంతోషాన్ని ఇచ్చిందని అన్నారు. 1995లో తాను నాటక రంగంలో అడుగుపెట్టి, ఓ ఉపాధ్యాయురాలుగా పలు గుర్తింపు పొందిన విద్యాసంస్థల్లో పనిచేసి ఎందరో విద్యార్థుల జీవితాలకు బంగారు బాటలు వేశానని అన్నారు. మహిళలు తమలోని శక్తిని బయటకు తీసి ప్రతిభను నిరూపించుకున్నపుడే ఇలాంటి గొప్ప గొప్ప అవార్డులు లభిస్తాయని తెలియజేశారు. ఏషియన్ ఇంటర్నేషనల్ కల్చర్ అకాడమి ఎంతో విశిష్టత కలిగిన వారిని గుర్తించి, వారిలోని నైపుణ్యం, సేవా గుణం, ఆధ్యాత్మికత వంటి ఎన్నో రంగాల్లో నైపుణ్యత పొందిన వారైతేనే డాక్టర్ రేట్ ప్రదానం చేస్తారన్న విషయం తాను ఇక్కడికి వచ్చాకే తెలిసి వచ్చిందని హసీనా జాన్ తెలియజేశారు. తెలుగువారి ఉగాది, పవిత్ర రంజాన్ పర్వదినాల్లో గౌరవ డాక్టరేట్ పొందడం తన పూర్వజన్మ సుకతంగా భావిస్తున్నానన్నారు. తన ఈ విజయానికి తోడ్పాటును అందించిన ప్రకాష్ రాజ్, సుందర్ బాబు, కెఎన్ రాజా, పాలాటి లక్ష్మి కులశేఖర్, భరద్వాజ్ మొదలగు ప్రతి ఒక్కరికీ పేరుపేరునా కతజ్ఞతలు తెలియజేసుకున్నారు.

శివయ్యా.. ప్రసాదం ఏదయ్యా..!

చలువ పందిళ్లకు 'ముందు'చూపేది..?
శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఇష్టారాజ్యం

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

శ్రీకాళహస్తీశ్వర ఆలయం ప్రసిద్ధిగాంచిన యాత్రాస్థలం. రాహుకేతు పూజలకు ఇక్కడ నెలవు. రోజుకు 40-50వేల మంది భక్తులు శ్రీకాళహస్తీశ్వరుని దర్శించుకుంటారు. కార్తీకమాసం, శివరాత్రి, సోమవారాల్లో ఆలయం కిక్కిరిసి ఉంటుంది. ఏటా రూ.200 కోట్ల ఆదాయం ఆలయానికి వస్తుంది. రాహుకేతు పూజలే పెద్ద ఆదాయ వనరు. తిరుమలలో తెల్లవారుజామున 3 గంటల నుంచి రాత్రి ఆలయం మూసేంత వరకూ శ్రీవారి ప్రసాదాన్ని భక్తులకు అందిస్తూనే ఉంటారు. అయితే రూ.200 కోట్ల పైనే ఆదాయం వస్తున్న శ్రీకాళహస్తిలో భక్తులకు ఉచితంగా కప్పు ప్రసాదం ఇచ్చేందుకు వెనకడుగు వేస్తున్నారు. భక్తుడు ఈశ్వరుని దర్శించుకున్న తరువాత తీర్థంతో పాటు, శఠగోపం, ప్రసాదం ఆశిస్తాడు. అయితే శ్రీకాళహస్తి ఆలయంలో అలా లేదు. ఉదయం 8 గంటల నుంచి 9 గంటలకల్లా ప్రసాదం ముగించేస్తారు. మళ్లీ సాయంత్రం గంటసేపు అందిస్తారు. ఆ మధ్యలో వచ్చిన భక్తులకు మాత్రమే ప్రసాద ప్రాప్తం. మిగిలిన వారికి లేనట్లే. అయితే మిగతా సమయాల్లో వచ్చిన భక్తులు సెంటిమెంట్‌గా ఫీలవుతున్నారు. కనీసం స్వామివారి ప్రసాదానికి తాము నోచుకోమా? అని మొహం మీదనే అడిగేస్తుండటం గమనార్హం. లడ్డూ, వడ, బెల్లం పొంగలి, జిలేబీ,

పులిహోర మాత్రం విక్రయానికి పెట్టారు. ప్రసాదం కావాల్సిన వారు కొనుక్కుని తినాల్సిందే.

'చలువ పందిళ్లకు' ముందుచూపు లేదా..?

సహజంగా వేసవి కాలం మార్చి, ఏప్రిల్, మే, జూన్ నెలలని అనుకుంటాం. అయితే గత పదేళ్లుగా తూర్పు మండలాల్లో వేసవి తీవ్రత ఫిబ్రవరి నుంచే మొదలై వడగాల్పులు ఉంటున్నాయి. ఈలోపే మార్చి నెలలో శివరాత్రి సైతం పది రోజుల పాటు బ్రహ్మోత్సవాలను వేడుకగా జరుపుకున్నారు. అయితే తూర్పు మండలాల్లో ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని నాలుగు నెలల పాటు చలువ పందిళ్లు ఉంటే భక్తులు సేదతీరేందుకు ఇబ్బంది లేకుండా ఉంటుంది. అయితే శ్రీకాళహస్తీశ్వర ఉన్నతాధికారులు ఏప్రిల్ నెలలో చలువు పందిళ్లు వేసేందుకు పూనుకోవడం గమనార్హం.

ఏప్రిల్ నెలలో చలువ పందిళ్లు వేస్తూ..

అలిపిరి టోల్ గేట్‌లో వ్యక్తి హల్చల్

అన్యమతస్థుడి రాకపై టిటిడి విజిలెన్స్ ఆరా

ప్రజాశక్తి -తిరుమల

తిరుమల అలిపిరి చెక్ పాయింట్ దగ్గర ఓ వ్యక్తి హల్ చల్ చేశాడు. చెక్ పాయింట్ వద్ద బైక్ ను ఆపకుండా తప్పించుకుని తిరుమల వైపు దూసుకెళ్లాడు. అమీర్ అంజాద్ ఖాన్ అనే అన్యమతస్థుని నిలువరించేందుకు భద్రతా సిబ్బంది చాలా ప్రయత్నించారు. కానీ అతను వేగంగా దూసుకెళ్లాడు. అంతేకాకుండా ఘాట్ రోడ్డులో ర్యాష్ డ్రైవింగ్‌తో వెళ్లడంతో పలు వాహనాలను ఢీకొట్టాడు. అతన్ని జీఎన్సీ టోల్ గేట్ వద్ద విజిలెన్స్ సిబ్బంది అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. సోమవారం ఉదయం 6 గంటల సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. అలిపిరి నుంచి తిరుమల వరకు ఓ సాధారణ వ్యక్తి తన బైక్ పై వెళ్తుంటే అతన్ని అదుపులోకి తీసుకునే వ్యవస్థ టీటీడీ వద్ద లేకపోవడం తిరుమలలో ఉన్న భద్రతా డొల్లాతనాన్ని వెలుగులోకి తీసుకువచ్చింది. రంజాన్ వేడుకలు జరుగుతున్న టైమ్ లో ఓ అన్యమతస్థుడు తిరుమల వైపు దూసుకెళ్లడం వెనుక ఏమైనా కారణం ఉందా అని ఆరా తీస్తున్నారు.

మంచి సందేశాత్మక చిత్రం ఏఎల్‌సిసి: లేలీధరరావు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

ఓ యువకుడి జీవితంలో బ్యాచిలర్ లైఫ్ అనేది సహజంగా వస్తుందని, ఆ సమయంలో లక్ష్య సాధన వైపు అడుగులు వేసే క్రమంలో ఏర్పడే ఒడిదుడుకులను తట్టుకుని విజయం వైపు సాధించే సందేశాత్మక చిత్రమే యాంటీ లేడీ కమిటీ చైర్మన్ (ఏఎల్‌సిసి) అని చిత్ర నిర్మాత, దర్శకులు లేలీధరరావు పేర్కొన్నారు. సోమవారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎల్ ఆర్ ఫిల్మ్ సర్క్యూట్ పతాకంపై ఓ మంచి కథాంశంతో ఈనెల 25న రాష్ట్రవ్యాప్తంగా 40 థియేటర్లలో ప్రేక్షకుల ముందుకు వస్తున్న తమను, చిత్రాన్ని ఆదరించాలని విజ్ఞప్తి చేశారు. తిరుపతి పరిసర ప్రాంతాలతో పాటు మైపాడు సముద్ర తీరం వద్ద దాదాపు సినిమాను చిత్రీకరించామని, రూ.1.25 కోట్ల రూపాయలు సినిమాకు ఖర్చు అయ్యిందన్నారు. రెండు గంటల నిడివి గల ఈ చిత్రం ప్రేక్షకుల ఆదరణ పొందుతుందని ఆకాంక్షిస్తున్నామన్నారు. ఇందుకు సంబంధించిన చిత్ర పోస్టర్ ను సినిమా యూనిట్ తో కలిసి ప్రెస్ క్లబ్లో ఆవిష్కరించారు. తిరుపతిలో విద్యాభ్యాసం చేసిన నవీన్ కథానాయకుడిగా, తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్ నగరానికి చెందిన శ్రావణి శెట్టి కథానాయకగా ఈ చిత్రంలో నటించారన్నారు. ఈ విలేకరుల సమావేశంలో సంగీత దర్శకులు జస్వంత్, నటులు కమల్, శ్రీనివాసులు రెడ్డి, ధనుష్ దేవరపోలి, చంద్రారెడ్డి పాల్గొన్నారు.

రెవెన్యూ అధికారుల దందా ఆపాలి : సిపిఎం

ప్రజాశక్తి - వరదయ్యపాలెం : మండలంలోని వికెఆర్ వైకాలనీలో ఇల్లు నిర్మిస్తున్న పేదలపై రెవెన్యూ అధికారుల దందా ఆపాలని సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు దాసరి జనార్దన్, సత్యవేడు వరదయ్యపాలెం, నాగలాపురం మండలాల ప్రాంతీయ కమిటీ కార్యదర్శి మెలుగు రమేష్ రెవెన్యూ అధికారులకు కోరారు. వి కె ఆర్ వై కాలనీలో నెల్లూరు జిల్లా నుండి వలస వచ్చి 20 సంవత్సరాలుగా స్థిరపడి, స్థలం కొనుగోలు చేసి అప్పో, సప్పో చేసి కట్టుకుంటున్న ఇండ్లపై చిన్నపాండూరు వీఆర్వో, వీఆర్ఏలు బెదిరింపులకు పాల్పడుతూ మామూలు ఇస్తే తప్ప ఇల్లు కట్టుకోవడానికి లేదని హుకుం జారీ చేస్తున్నట్లు బాధితులు యేసు, పుల్లయ్యలు సిపిఎం పార్టీ నాయకుల దృష్టికి తీసుకురాగా జనార్ధన్, రమేష్‌లు గ్రామానికి వెళ్లి సందర్శించి వారిని పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెవెన్యూ అధికారులు పేదలపై దందా, దాడులు ఆపాలని పెద్దలు భూ అక్రమణులకు పాల్పడుతుంటే చూసి చూడనట్లు వ్యవహరించే రెవెన్యూ అధికారులు వలస కూలీలపై, బేల్దారి పనులు చేసుకుని రోజు వారి కూలీలపై దాడులు చేయడం దారుణమన్నారు. ఇల్లు కడితే పడదోస్తామని బెదిరించడం ఏమిటని ప్రశ్నించారు. రెవెన్యూ అధికారులు స్పందించి వీఆర్వో, వీఆర్ఏలపై చట్టపరమైన చర్యలు తీసుకొని పేదలకు అండగా నిలబడి, వారి ఇల్లు కట్టుకోవడానికి ఎలాంటి అభ్యంతరాలు లేకుండా చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. అధికారులు పద్ధతి మార్చుకోకపోతే అధికారుల సహకారంతో నిర్మితమైన అక్రమ నిర్మాణాలను కూల్చేంత వరకు కార్యాలయం వద్ద ధర్నా చేస్తామని హెచ్చరించారు.

పాస్టర్ ప్రవీణ్ మృతిపై దర్యాప్తు జరపాలి

ప్రజాశక్తి - సత్యవేడు: ఈ నెల 24న తూర్పుగోదావరి జిల్లా కొంతమూరు సమీపంలో అనుమానస్పద స్థితిలో మృతి చెందిన పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతిపై సమగ్ర దర్యాప్తు జరిపించి నిందితులను అరెస్ట్ చేసి, ప్రవీణ్ పగడాల కుటుంబానికి న్యాయం చేయాలని క్రైస్తవ సంఘాల నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం సత్యవేడులో స్థానిక క్లాక్ టవర్ వద్ద నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో బెరాక ప్రేయర్ హౌస్ బ్రదర్ ప్రేమ్ రాజ్, బ్రదర్ శ్యామ్, బ్రదర్ కవి అరసన్, పాస్టర్ జస్టియన్ తదితరులు పాల్గొన్నారు.

ఉగాది పురస్కారానికి రాసాని ఎంపిక

ప్రజాశక్తి - క్యాంపస్ : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఉగాది పురస్కారమైన ప్రతిభా పురస్కారానికి ఈ సంవత్సరానికి గాను ప్రముఖ కథా, నవల, నాటకం రచయిత, కవి, విమర్శకుడు, కాలమిస్టు, నటుడు, నాటక ప్రయోక్త, మంచి ఉపన్యాసకుడు, బహుముఖ ప్రజ్ఞావంతుడు, లబ్ధప్రతిష్టుడైన డా:వి.ఆర్.రాసాని ఎన్నికైనారు.

పశు బీమా ప్రీమియం తగ్గింపు

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : పాడి పశువులకు పశు భీమా ప్రీమియం తగ్గించారని గూడూరు వెటర్నరీ ఏడి సురేష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రైతు వాటా ఏప్రిల్ 1వతేది నుండి 15%, ప్రభుత్వ సబ్సిడీ 85% గా మార్చడం జరిగిందని తెలిపారు. అంతకు ముందు 20%, 80% గా ఉండేదని పేర్కొన్నారు. ఒక రైతు 10 పశువులకు, ,100 గొర్రెలు, మేకలకు, 50 పందులకు భీమా చేసుకోవచ్చని ఆ ప్రకటనలో తెలిపారు.

శ్రీ సాధు భద్రేశదాస్ స్వామికి సరస్వతీ సమ్మాన్ అవార్డు

ప్రజాశక్తి - క్యాంపస్ : మహామహోపాధ్యాయ సాధు భద్రేష్‌దాస్ స్వామి తన సంస్కృత పుస్తకమైన స్వామినారాయణ సిద్ధాంత సుధకు సరస్వతీ సమ్మాన్ 2024ను అవార్డు పొందారు. ఈ ప్రతిష్టాత్మక సరస్వతీ సమ్మాన్ అవార్డును ప్రదానం చేయనున్నట్లు న్యూఢిల్లీ, కెకె బిర్లా ఫౌండేషన్ వారు మార్చి 26న ఒక ప్రకటనలో వెల్లడించారు. ఈ సందర్భంగా జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం, తిరుపతి వైస్ ఛాన్సలర్ ప్రొ.జి.ఎస్.ఆర్ కృష్ణమూర్తి స్వామీజీకి విశ్వవిద్యాలయం తరపున అభినందనలు తెలిపారు.

హ్యూమన్ రైట్ కౌన్సిల్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా డాక్టర్ ఉషారాణి

ప్రజాశక్తి - చిన్నగొట్టిగల్లు: భాకరాపేటకు చెందిన ప్రముఖ రచయిత్రి ధనాసి ఉషారాణికి అరుదైన గౌరవం దక్కింది. ఆమె హ్యూమన్ రైట్ కౌన్సిల్‌లో జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమితులయ్యారు. ఆమె చేస్తున్న సామాజిక సేవ కార్యక్రమాలను గుర్తిస్తూ ఇండియన్ హ్యూమన్ రైట్ కౌన్సిల్‌లో జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమిస్తూ ప్రో.దిశాంతు బజాజ్, డా. యం పవన్ కళ్యాణ్ అబ్బాస్ మేహిద్ నేషనల్ ప్రమోటర్ నియామక పత్రం అందజేశారు. ఆమె ఇదివరకు నేషనల్ ఉమెన్స్ వింగ్స్‌లో వైస్ చైర్మన్‌గా చైల్డ్ లేబర్ గురించి సేవా కార్యక్రయాలపై కృషి చేశారు. స్థానికులు,నాయకులు ఆమెకు అభినందనలు తెలిపారు.

ఎమరాల్డ్స్‌లో ఉత్సాహంగా టెక్నో- 2025

ప్రజాశక్తి - తిరుపతి(మంగళం): తిరుపతి, నరసింహ తీర్థం రోడ్డులో గల ఎమరాల్డ్స్ డిగ్రీ కళాశాలలో టెక్నో– 2025 పేరిట బిఎస్సి, బీసీఏ విద్యార్థులకు టెక్నికల్ ఫెస్ట్‌ను కళాశాల యాజమాన్యం నిర్వహించింది. కంప్యూటర్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో విద్యార్థుల సృజనాత్మకతను వెలికితీసి వారి నైపుణ్యాలను మరింత పెంచుతూ ఉన్నత ఉద్యోగ ఉపాధి అవకాశాలలో స్థిరపడడానికి ప్రతి ఏటా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కళాశాల సంచాలకులు గిరిధర్, విశ్వనాథ్ తెలిపారు. టెక్నో ఫెస్ట్‌లో భాగంగా ప్రథమ, ద్వితీయ, తృతీయ సంవత్సరం బిఎస్సి, బీసీ విద్యార్థులకు బ్లైండ్ ప్రోగ్రామింగ్, కోడ్ రన్నర్, కోడ్ షఫల్, ప్లకాట్, స్పీకప్, డి బగ్గింగ్ విభాగాలలో పోటీలు నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతి ప్రధానం చేసామని కళాశాల ఉపసంచాలకులు మునిరత్నం తెలిపారు. టెక్నో – 2025 ఛాంపియన్‌షిప్‌ను టెక్ ఆల్ఫా బృందం విద్యార్థులు సొంతం చేసుకున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కంప్యూటర్ సైన్స్ అధ్యాపకులు నరసింహ, శ్రీనివాసులు రెడ్డి, చేతన్ కుమార్, జి.ఎమ్. శ్రీనువాసులు, ప్రిన్సిపాల్ జాఫర్ వల్లి, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి వైఖరి మారాలి

చిన్నగొట్టిగల్లు మండలం వైఎస్సార్సీపీ అధ్యక్షుడు సింహాల మోహన

ప్రజాశక్తి - చిన్నగొట్టిగల్లు : బడుగు, బలహీనుల పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వైఖరి మారాలని చిన్నగొట్టిగల్లు మండలం వైఎస్సార్సీపీ అధ్యక్షుడు సింహాల మోహన పేర్కొన్నారు. సోమవారం చిన్నగొట్టిగల్లులో స్థానిక విలేఖర్లతో మాట్లాడుతూ దళిత, బడుగు బలహీన వర్గాల ఆలోచన ఆ పూట వరకే అని సీఎం అనడం దారుణమన్నారు.

అక్రమార్కులకు అధికారుల అండదండ

- అడిగే వారు లేక కబ్జాకు గురౌతున్న ప్రభుత్వ భూములు
- రోడ్డు పక్కన స్థలాలను ఆక్రమించి.. షాపులు నిర్మాణం
- ప్రమాదపుటంచున ప్రజలు, వాహనదారులు

ప్రజాశక్తి - నాయుడుపేట: నాయుడుపేట పట్టణంలో ప్రభుత్వ స్థలాల ఆక్రమించేసుకో అడిగేది ఎవరు.. ఆపేదేవరు అనే విధానాలు కొదరిలో పెరిగిపోతున్నాయి. రాజకీయ బలం ఉన్న బడా వ్యాపారస్తులు ప్రభుత్వ భూములను ఆక్రమించేసుకుంటున్నా అధికారులు వారిని ఆపకసోగా సహాయ సహకారాలు అందిస్తున్నారు. వారి అండదండలతో అక్రమార్కులు అన్ని రంగాల్లో చెరలరేగి పోతున్నారు. ప్రభుత్వ స్థలాలు ఆక్రమించే కబ్జాదారులకు అడ్డే లేకుండా పోయింది. ఇక్కడ రాజకీయబలం, ఆర్థిక బలం ఉన్న వ్యాపారస్థులు ఎన్ని అక్రమాలకైనా పాల్పడవచ్చు. అధికారులు ఆపడం కాదు కదా అటువైపు కన్నెత్తైనా చూసే సాహసం కూడా చేయరు.

ఇక విషయానికొస్తే నాయుడుపేట ఆర్టీసీ బస్టాండ్ నుంచి తుమ్మూరుకు వెళ్లే దారిలో రైల్వే గోడకు మినీ బైపాస్‌కు మధ్యన రోడ్డుకు అనుకుని ఉన్న స్థలాన్ని ఎప్పటినుంచో ఆక్రమించుకుని, షాపులు నిర్మించి అద్దెలకిచ్చి సంపాదిస్తున్న వారు కొందరైతే, రైల్వే స్టేషన్‌కు ఎదురు వైపు వారికున్న కొంత పట్టా స్థలాలకు, మరికొంత ప్రభుత్వ భూమి కలిపేసుకుని బిల్డింగులు కట్టుకుంటున్నవారు మరికొందరు. గతంలో కొంత భాగం మాత్రమే ఆక్రమణ గురై ఉండేది రెండు మూడు సంవత్సరాలుగా ఈ కబ్జాలు మరింత పెరిగి మిగిలిన ఆ సగభాగాన్ని కూడా కబ్జా చేసేశారు. ఇలా ఆక్రమణలకు పాల్పడుతున్న వారిలో గతంలో రెవెన్యూ శాఖలో పనిచేసి రిటైర్ అయిన వాళ్ళు కూడా ఉన్నారు. ఇక్కడ విశేషంగా చెప్పుకోవాల్సింది ఒక్కొక్కరు మూడు నాలుగు స్థలాల ఆక్రమించుకోవడమే కాకుండా ఒకరు ఆక్రమించుకున్న స్థలంలో మరొకరు చేరి నాదంటే నాదంటూ గొడవలు పడి గుంపులు గుంపులుగా కొట్టుకుని పోలీస్ స్టేషన్ కి వెళ్లి పోలీసుల సమక్షంలోనే తీర్మానాలు చేసుకొని పంచుకుంటున్నారు. కబ్జా గురైన ఈ స్థలా లన్నీ గతంలో ఆర్ అండ్ బి శాఖ ఆధీనం లో ఉండేవి. నాలుగు సంవత్సరాల ముందు వాటిని హైవే అథారిటీకి అప్పగించారు. హైవే అథారిటీకి సంబంధించిన అధికారులు ఎవరూ నాయుడుపేట దరిదాపుల్లో కనిపించరు. ఆ శాఖకు చెందిన స్థలాలన్నీ కబ్జాలకు గురవుతున్నా వారు ఏమాత్రం స్పందించక పోవడం, అసలు కనీసం ఇటువైపు చూడకపోవడం గమనార్హం. కబ్జాల విషయం పక్కన పెడితే ఆ శాఖలో వింత పోకడలు కనిపిస్తున్నాయి. నాయుడుపేట నుంచి పూతలపట్టుకు నూతనంగా నిర్మించిన సిక్స్ వే నేషనల్ హైవేలో హైవే అదికారులు, భూస్వాముల కోసం ప్రత్యేక విధానాలను అవలంబిస్తున్నారు. పట్టణానికి అటువైపున్న పల్లెలు కారుమంచి వారి కండ్రిగ, జువ్వలపాలెం, మంద బైలు, తాల్వాయిపాడు ప్రజలకు పట్టణంలోకి వచ్చేందుకు హైవే మధ్యలో దారి కల్పించాలని లేకపోతే అటు వైపు ప్రజలు పట్టణంలోకి, ఇటువైపు నాయుడుపేటలో నివాసం ఉంటున్న వ్యవసాయదారులు అటు వైపునున్న పొలాలకు ఎరువులు మందులు తీసుళ్లేందుకు హైవే చుట్టూ తిరిగి వెళ్లాలంటే పది కిలోమీటర్లు దూరం పెరుగుతుందని, దారి కల్పిస్తే అర కిలోమీటర్ దూరంతో తమకు సౌకర్యంగా ఉంటుదని అధికారులకు విన్నవించుకున్నా ఫలితం లేదు. అదే అధికారులు వారి పరిధి దాటి, అగ్రవర్ణానికి చెందిన భూస్వామి కోసం హైవే కి రక్షణగా నిర్మించే కంచెను సైతం తీసేసి ఆయన ఇంట్లోకి రాకపోకల కోసం పక్కనే 30 అడుగుల దూరంలో దారి ఉన్నప్పటికీ, ప్రత్యేకించి అయన కోసం దాదాపు వంద అడుగుల మరో దారి ఏర్పాటు చేయడం.. ప్రతి ఒక్కరిని ఆశ్చర్యానికి గురిచేస్తోంది. ఆర్ అండ్ బి అధికారులైన డిఈ పరమేశ్వరి, జెఈ చెన్నరాయుడులకు హైవే భూములు ఎక్కడెక్కడ ఉన్నాయో తెలియనట్లు వ్యవహరిస్తారు. ఇదే అలుసుగా కొందరు హైవే భూములు ఆక్రమించుకుని షాపులు కట్టి మరీ అద్దెకు ఇస్తున్నారు. హైవే నిబంధనలను అతిక్రమిస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. ఇప్పటికే ఎందరో ప్రమాదాలకు గురై, అదృష్ట వశాత్తూ ప్రాణాపాయం నుంచి బయటపడ్డా, అటు ఆర్ అండ్ బి అధికారులలో ఏమాత్రం చలనం రావడం లేదు. రెండు సంవత్సరాల ముందు నాయుడు పేట నుంచి చెన్నైకి వెళ్లే దారిలో ట్రినిటీ హాస్పిటల్ ముందు రైల్వే బ్రిడ్జిపై నిర్మించిన రోడ్డు అత్యంత ప్రమాదంగా మారింది. రోడ్డుపై తారు గడ్డలుగా మారి ద్విచక్ర వాహదా రులకు ప్రాణాపాయంగా మారింది. కబ్జాలపై అధికారు లను పలుమార్లు వివరణ కోరినా, ఏదో ఒక శాఖపై తోసేసి చేతులు దులుపుకునే ప్రయత్నాలు చేస్తున్నారే తప్ప వాటికి సమాధానం గాని పరిష్కారాలు గాని చూపటం లేదు. ఇప్పటికైనా అధికారులు, రాజకీయ నాయకులు స్పందించి ప్రజల ప్రాణాలను, ప్రభుత్వ భూములను కాపాడాల్సిన అవసరం ఎంతైనా ఉందని స్థానికులు కోరుతున్నారు.

వాడవాడలా ఘనంగా రంజాన్ వేడుకలు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : రంజాన్ పండుగను పురస్కరించుకొని పుత్తూరు మున్సిపాలిటీ 10వ వార్డులో టీడీపీ కౌన్సిలర్ అభ్యర్థి డి.సుజాత, 10 వార్డ్ ఇన్చార్జి రాష్ట్ర తెలుగు యువత మీడియా కోఆర్డినేటర్ డి.జి.ధనపాల్‌ల ఆధ్వర్యంలో ఇంటింటికి వెళ్లి ముస్లింలకు రంజాన్ తోఫా అందించారు.

ముస్లింలకు ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ శుభాకాంక్షలు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : రంజాన్ పండుగను పురస్కరించుకుని పట్టణంలోని అన్ని మసీదులలో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. నగరి ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ 'ఎక్స్' వేదికగా నియోజకవర్గ ముస్లింలకు శుభాకాంక్షలు తెలియజేశారు.

మైనారిటీ నాయకుడు హమీద్ బాషాకు ఘన సన్మానం

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : రంజాన్ సందర్భంగా గూడూరు, దర్గా వీధిలో ఉన్న ఈద్గా వద్ద ముస్లింలు భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు నిర్వహించారు. రంజాన్ సందర్భంగా మైరనారిటీ నాయకులు హమీద్ బాషాను టీడీపీ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు రావిళ్ళ మాధవ నాయుడు, అధ్యక్షులు టిఎన్‌టియుసి చిత్తూర్ పార్లమెంట్, పుత్తూరు రూరల్ టిడిపి అధ్యక్షులు డి.రవికుమార్ మసీద్ ప్రెసిడెంట్ మహమ్మద్ గౌస్ చిత్తూరు పార్లమెంట్ టిడిపి మైనార్టీ సెల్ షాబ్బర్, పుత్తూరు పట్టణ తెలుగు మహిళా ప్రధాన కార్యదర్శి మోహన, నియోజకవర్గ తెలుగుమహిళ సోషల్ మీడియా కోఆర్డినేటర్ రజిని, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ముస్లిం సోదరుల ప్రత్యేక ప్రార్థనలు

ప్రజాశక్తి - ఓజిలి: మండలంలోని పలు గ్రామంల్లో సోమవారం ఉదయం రంజాన్ పండుగను ముస్లిం సోదరులు ఘనంగా జరుపుకున్నారు.మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

రంజాన్ శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తిలో రంజాన్ పర్వదిన వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. పెద్దమసీదు, చిన్నమసీదు, కుమారస్వామి తిప్పవీధి తదితర ప్రాంతాల్లోని మసీదులు, ఈదులగుంట ఈద్గా, అయ్యలనాయుడు చెరువులోని ఈద్గాతోపాటు పలు పవిత్ర ప్రదేశాల్లో ముస్లీం సోదరుల ప్రార్థనలు జరిగాయి. ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి అందుబాటులో లేని కారణంగా ఫోన్ ద్వారా ముస్లింలకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఆదివారం రాత్రి ఎమ్మెల్యే ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు ఇచ్చారు.

భక్తి, శ్రద్ధలతో రోజా దీక్ష విరమణ

ప్రజాశక్తి - చిన్నగొట్టిగల్లు: ఖురాన్ ఆవిర్భవించిన పవిత్ర రంజాన్ (ఈద్ ఉల్ ఫీతర్)పండుగను నెల రోజుల ఉపవాస దీక్షలు ముగించుకుని మండలంలోని ముస్లిం సోదరులు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకుని, ప్రార్థనలు చేశారు.

మసీదుల్లో పిల్లలు, పెద్దల ప్రార్థనలు

ప్రజాశక్తి - సత్యవేడు: రంజాన్ సందర్భంగా సోమవారం ఉదయం పిల్లలు, పెద్దలు మసీదులకు చేరుకుని సామూహిక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా మసీదులో ఇమామ్ పవిత్ర ఖురాన్ సూక్తులను పఠించి వినిపించారు.

జామియా మసీదు కమిటీ ఆధ్వర్యంలో రంజాన్ వేడుకలు

ప్రజాశక్తి -ఏర్పేడు : రంజాన్ పండుగ సందర్భంగా పాపానాయుడుపేట జామియా మసీద్ కమిటీ ఆధ్వర్యంలో ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముత్తవల్లి లాలాసాహెబ్, కార్యదర్శి ఆషీమ్, పూల భాష, సర్దార్ మౌలా, సలహాదారులు కరీముల్లా, అబ్దుల్ ఖాదర్ తదితరులు పాల్గొన్నారు.

భక్తి భావానికి ప్రతీక రంజాన్ : పులివర్తి వినీల్

ప్రజాశక్తి - రామచంద్రాపురం (చంద్రగిరి) సత్యవర్తనకు, భక్తి భావానికి రంజాన్ పత్రీక అని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని తనయుడు పులివర్తి వినీల్ అన్నారు. చంద్రగిరి ఈద్గా మైదానంలో సోమవారం రంజాన్ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ముక్కంటి ఆలయంలో మళ్లీ అంతర్గత బదిలీలు

- బదిలీలు కొందరికే పరిమితమా..!!
- ఏళ్ల తరబడి ఒకే స్థానంలో సిబ్బంది

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో మళ్లీ అంతర్గత బదిలీలు జరిగాయి. ఈవో బాపిరెడ్డి ఆదేశాలతో డిప్యూటీ ఈఓ కృష్ణారెడ్డి బదిలీ ఉత్తర్వు జారీ చేశారు. అయితే బదిలీలు కొందరికి మాత్రమే పరిమితమయ్యాయి. కొందరు సంవత్సరాల తరబడి ఒకే స్థానంలో ఉన్నా వారికి బదిలీలు లేవు. ఆలయానికి అనుబంధంగా ఉన్న భరద్వాజ తీర్థం నిర్వహణ చూస్తున్న ఏఈ రాజేశ్వరిని స్కిట్, నర్సింగ్ కళాశాలకు బదిలీ చేశారు. శివ సదన్ అతిథి గృహం నిర్వహణ చూస్తున్న ఏఈ శోభారాణిని భరద్వాజ తీర్థం నిర్వహణ బాధ్యత అదనంగా కట్టబెట్టారు. ఆలయాల నిర్మాణాలకు సహకరిస్తున్న సహాయ స్థపతి కుమార్‌ను రాహు కేతు పూజలకు సంబంధించిన వెండి నాగ పడగల తయారీ కేంద్రానికి బదిలీ చేశారు. ప్రధాన ఆలయం ఏఈఓగా ఉన్న లోకేష్ బాబును స్కిట్ కళాశాల, లీగల్, అన్నదానం, గోశాల నిర్వహణకు బదిలీ చేశారు. లీగల్, భూములు, గోశాల, అన్నదానం పర్యవేక్షణ చేసే ఏఈఓ సతీష్ మల్లిక్‌ను ప్రోటోకాల్, అతిథి గృహాలకు బదిలీ చేశారు. ప్రోటోకాల్ అతిథి గృహాల నిర్వహణ చూస్తున్న ఏఈఓ విద్యాసాగర్‌ను ప్రధాన ఆలయానికి మార్పు చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత 78 మందిని బదిలీ చేశారు. తిరిగి మరలా ఇప్పుడు కొందరిని బదిలీ చేశారు. అయితే ఆలయంలో, కార్యాలయంలో సంవత్సరాల తరబడి ఒకే స్థానంలో ఎంతోమంది ఉన్నారు. వారికి బదిలీలు జరగడం లేదు. ప్రతి ఆరు నెలలకు ఒకసారి సిబ్బంది స్థానాలు బదిలీ చేసే సాంప్రదాయం ఉండేది. అయితే అధికారులు అటువంటి వాటిని అమలు చేయడం లేదు. సిబ్బంది అందరూ అన్ని విభాగాల్లో పనిచేస్తే అవగాహన ఉంటుంది. కొందరిని కొన్ని సీట్లకే పరిమితం చేస్తున్నారు. దీనిపై సిబ్బంది అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

అర్చక సంఘం రాష్ట్ర అధ్యక్షులుగా నరసింహమూర్తి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : అర్చక సంఘం రాష్ట్ర అధ్యక్షులుగా పాలూరి నరసింహమూర్తి నియమితులయ్యారు. ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు కోనూరు సతీష్ శర్మ ఆదివారం ఆదేశాలు జారీ చేశారు.

కిడ్నాప్ కథ సుఖాంతం..?

ఇంటికి చేరిన కుటుంబసభ్యులు.. పోలీసుల అదుపులో నిందితులు

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో : సినీ ఫక్కీలో జరిగిన రాజేష్ కుటుంబ కిడ్నాప్‌కథ సుఖాంతమైనట్లే.. చిన్ననాటి స్నేహితుడే డబ్బు కోసం ఈ అఘాయిత్యానికి పాల్పడినట్లు పోలీసుల విచారణలో తేలినట్లు సమాచారం. ఇద్దరు ప్రధాన నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. కిడ్నాప్ చెర నుంచి తప్పించుకునేందు కారులోనుంచి దూకేసిన రాజేష్‌కు మెరుగైన చికిత్స కోసం ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. తల్లి విజయలక్ష్మి కిడ్నాపర్ల చెర నుంచి చిత్తూరు – బెంగుళూరు మధ్య టోల్‌గేట్ వద్ద తప్పించుకుని ఆటోలో క్షేమంగా ఆదివారం ఇంటికి చేరింది. పోలీసులు కనిపెట్టారని తెలుసుకున్న కిడ్నాపర్లు రాజేష్ భార్య సుమతి, పిల్లలు జస్విత, యశ్వితలను బెంగుళూరులోని ఆమె పుట్టింట్లో వదిలి వెళ్లిపోయారు. బెంగుళూరుకు వెళ్లిన పోలీసులు రెండు బృందాలుగా విడిపోయి కారు సిసి పుటేజీల ఆధారంగా ఈ ఘటనలో భాగస్వామ్యమైనట్లు ఐదుగురిని గుర్తించారు. వారిలో రాజేష్ చిన్ననాటి స్నేహితుడు భార్గవ్, అతని స్నేహితుడు అరుణ్‌కుమార్‌లను అదుపులోకి తీసుకున్నారు. డ్రైవర్లతో పాటు మరొకరు పరారీలో ఉన్నట్లు సమాచారం. రాజేష్ తల్లి విజయలక్ష్మి చెప్పిన వివరాల మేరకు భార్గవ్ తన కొడుకువద్ద 24 లక్షల అప్పు తీసుకోవడమే కాకుండా అడిగినందుకు బెదిరించాడని, రూ.2 కోట్లు ఇస్తేనే వదిలేస్మాని, లేదంటే చంపేస్తామని మమ్మల్ని శుక్రవారం రాత్రి అక్కారంపల్లిలోని అపార్టుమెంట్‌లో ఉంచాడు. వెంకటగిరిలోని పొలాలను తన పేరుపై రిజిస్ట్రేషన్ చేయాలని వత్తిడి పెట్టాడు. దీంతో తన కొడుకు రాజేష్ కిడ్నాపర్ల చెర నుంచి బయట పడేందుకు చిత్తూరులో డబ్బు ఇప్పిస్తానని చెప్పి శనివారం కారుల్లో వెళ్లాం. నా కొడుకు, భార్గవ్ ఓ కారులో, తాను, కోడలు, మనవరాళ్లు మరోకారులో వెళ్లాం. అయితే తన కొడుకు రాజేష్ కిడ్నాపర్ల చెర నుంచి తప్పించుకోవాలని కదులుతున్న కారు నుంచి దూకేయడంతో తీవ్రంగా గాయపడి ప్రస్తుతం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. తాను సైతం ఓ టోల్‌గేటు వద్ద కిడ్నాపర్ల నుంచి తప్పించుకునేందుకు ఓ ఆటో సాయం తీసుకుని తిరిగి తిరుపతికి వచ్చేశాను. గాయపడిన నా కొడుకు పరిస్థితి, కిడ్నాపర్ల చెరలోనే ఉన్న తన కోడలు, మనవరాళ్లను ఏమి చేస్తారోనని భయపడ్డాను. అయితే వారిని బెంగుళూరులో వదిలేసి వెళ్లిపోయారు. నమ్మిన స్నేహితుడే తన కొడుకును ఈ విధంగా బెదిరించి కిడ్నాప్ చేస్తాడని అనుకోలేదు. ఎప్పటికైనా అతని నుంచి నా కుటుంబానికి ముప్పు ఉంటుందని పోలీసుల ముందు చెప్పింది. గతంలో వారిద్దరి మధ్య జరిగిన వివరాలను పోలీసులకు తెలియజేసినట్లు సమాచారం. సీసీ ఫుటేజ్, కాల్ డేటాను పరిశీలిస్తున్నారు.

మామిడి రైతుల ఆశలు ఆవిరి

- పూత రావడమే ఆలస్యం..
- అయినా విరగ పూసిన పూత
- తుదకు పూత రాలి మిగిలిన కాడలు

పూత రాలి.. కాడలు మిగిలిన మామిడి చెట్టు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్: ప్రతికూల వాతావరణం పరిస్థితులతో మామిడి పూత ఈ సీజన్‌లో ఆలస్యంగా వచ్చింది. అయిన్నప్పటికీ పూత విస్తారంగా రావడంతో రైతుల ఆశలు మమిడిపై పెరిగాయి. సాధారణంగా నవంబర్, డిసెంబర్ మాసాలలో పూత వచ్చి సంక్రాతిలో పిందెలు ఏర్పడి శివరాత్రికి శివలింగం అంత మామిడి కాయ ఉండాలని పెద్దల నానుడి. అటువంటింది గత ఏడాది అత్యధిక వర్షపాతం వలన పూత ఫిబ్రవరి ప్రారంభమైనా రాలేదు. మార్చి మొదటి మాసంలో పూత రావడంతో అప్పటికే ఉష్ణోగ్రతలు పెరిగిపోయి, పూత మగ్గిపోయి రాలిపోయింది. కాండాలు మాత్రమే నిలబడింది. పూతలు బాగా వచ్చిందిని సంబరపడిన రైతులు, పూత రాలిపోవడంతో దిగాలు పడిపోయారు. ప్రతి ఏడాది ఏదో విధంగా రైతులకు ప్రతికూల వాతావరణ పరిస్థితులు ఏర్పడడంతో రైతున్నలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రత్యామ్యాయ పంటలే దిక్కని రైతులు ఆలోచిస్తున్నారు. తూర్పు మండలాలలో పుత్తూరులో సుమారు 9 వేల ఎకరాలు, వడమాలపేటలో 11 వేల ఎకరాలు, విజయపురంలో 14 వేల ఎకరాలలో మామిడి సాగు చేస్తున్నారు. ఈ ప్రాంత రైతులు మామిడి పైనే ప్రత్యక్షంగా, పరోక్షంగా ఆధార పడి జీవనం సాగిస్తున్నారు. దీంతో ఈ ఏడాది రైతులు మామిడి సాగుకు నిరాశక్తి చూపుతున్నారు.

అప్పు చేసి సాగు చేసినా ఫలితం లేదు

మామిడి సాగు కోసం అప్పు చేసి సాగు చేసినా ఫలితం దక్కేలా లేదు. పూత బాగా వచ్చింది. ఈ సారి మామిడి విరగకాస్తుందనుకున్నాం. అయితే ఉన్న పూత మగ్గిపోయి రాలిపోయింది. ఇప్పుడు అప్పులు ఎలా తీర్చాలో అర్థం కావడం లేదు. ప్రభుత్వం ఆదుకోవాలి.

-వెంకటాద్రి, దిగువ గూలూరు, పుత్తూరు మండలం

ఈ ఏడాది మామిడి సాగుతో నష్టాలే

మామిడి పంటను ఆధారంగా చేసుకుని జీవనం సాగించేవాళ్లం. ఇప్పుడు తోటలో ఏమాత్రం పూత లేకపోవడంతో ఏమి చేయాలో దిక్కుతోచని పరిస్థితిగా ఉంది. మామిడి పంటను నమ్ముకుంటే నష్టపోయేలా ఉన్నాం.

- చెంగయ్య, ఎగవగూళూరు, పుత్తూరు మండలం

మద్యం మత్తులో వ్యక్తి..
అవయవాలను చిద్రం చేసిన ఊర కుక్కలు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: మద్యం మత్తులో ఉన్న ఓ వ్యక్తిపై ఊర కుక్కలు దాడి చేసి శరీరావయాలను చిద్రం చేసిన ఘటన తొట్టంబేడు మండలంలోని కాసరం గ్రామంలో సోమవారం ఆలస్యంగా వెలుగు చూసింది. వివరాల్లోకి వెళితే.. కాసారం గ్రామానికి చెందిన కేతంశెట్టి శంకరయ్య ఆదివారం అదే గ్రామంలో అనధికారికంగా నిర్వహిస్తున్న ఓ బెల్టు షాపు వద్దకు వెళ్లి పూటుగా మద్యం తాగాడు. బెల్టు మద్యం కిక్కు ఎక్కువకావడంతో దుకాణం వద్ద ఉన్న పందిరి కిందే మత్తులోకి జారుకున్నాడు. అయితే తెల్లారుతున్నా శంకరయ్య ఇంటికి రాకపోవడంతో కంగారుపడ్డ కుటుంబ సభ్యులు గ్రామమంతా కలియజూశారు. చివరకు బెల్టు షాపు వద్ద ఏర్పాటుచేసిన పందిరి కింద తీవ్ర రక్త గాయాలతో పడి ఉన్న శంకరయ్యను చూసి ఖంగు తిన్నారు. ఆయన శరీరావయాలను ఊర కుక్కలు మాసం ముక్కలుగా కొరికి ఉండటాన్ని గుర్తించి, హుటాహుటిన చికిత్స నిమిత్తం తిరుపతిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయన పరిస్థితి విషమంగా ఉందని కుటుంబ సభ్యులు చెబుతున్నారు. గ్రామంలో అనధికారంగా బెల్టు షాపు నిర్వహించడం వల్లే ఈ పరిస్థితి తలెత్తిందని కుటుంబ సభ్యులు మండిపడ్డారు. ప్రజావ్యతిరేకతను పక్కనపెట్టి చేమూరులో ఏర్పాటుచేసిన ఓ మద్యం షాపు నుంచి సమీప గ్రామాల బెల్ట్ షాపులకు నిరంతరం మద్యం సరఫరా అవుతుందని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇదంతా సెబ్ అధికారులకు తెలిసినా కూటమినేతల ఒత్తిళ్లకు తలొగ్గి బెల్టు షాపులవైపు కన్నెత్తి చూడటం లేదన్న విమర్శలు వస్తున్నాయి.

మరోసారి ఎస్వీయూ క్యాంపస్‌లోకి చిరుత

ప్రజాశక్తి - క్యాంపస్ : తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర విశ్వ విద్యాలయం పరిసర ప్రాంతాలలో ముఖ్యంగా బాలికల వసతి గహం, దూరవిద్యా కేంద్రం పరిసర ప్రాంతాలలో విద్యార్థులకు పరిశోధకులకు ఆదివారం సాయంత్రం 8.30 గంటలకు కనిపించింది. అటవీ శాఖ అధికారులు, ఎస్వీయూ అధికారులు వర్సిటీ క్యాంపస్లో రాత్రివేళ సంచరించవద్దని బోర్డులు ఏర్పాటు చేసినా క్యాంపస్ ను పూర్తిగా పరిశుభ్రం చేసినా చిరుతపులి సంచారం మాత్రం మానుకోలేదు. చిరుతను బంధించేందుకు అటవీశాఖ అధికారులు పలుచోట్ల బోన్లు ఏర్పాటుచేసిన అది బోన్లో పడకుండా తెలివిగా వ్యవహ రించి పట్టు పడకపోవడం గమనార్హం. ఇప్పటికైనా ఉన్నతాధి కారులు అటవీ శాఖ అధికారులు చిరుత సంచరించే ప్రాంతాల ను గమనించి భయపెట్టి దూర ప్రాంతాలకు పారద్రోలే చర్యలు చేపట్టాలని విద్యార్థులు, పరిశోధకులు డిమాండ్ చేస్తున్నారు.

రైల్వే కమిటీ సభ్యులుగా హర్షవర్ధన్, వై.ఎస్. బాబు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్ : తిరుపతి రైల్వే స్టేషన్ కన్సల్టేటివ్ కమిటీ (ఎస్‌సిసి) సభ్యులుగా జూనియర్ ఛాంబర్ ఇంటర్నేషనల్ అంతర్జాతీయ కమిషన్ ఛైర్మన్ డాక్టర్ ఎన్ బి హర్షవర్థన్ రెడ్డి, తిరుపతి ఫిలిం సొసైటీ అధ్యక్షుడు వై.ఎస్. బాబు నియమితులు అయ్యారు. ఈ మేరకు సౌత్ సెంట్రల్ రైల్వే గుంతకల్లు డివిషన్ అసిస్టెంట్ కమర్షియల్ మేనేజర్ ధనంజయ కుమార్ సింగ్ ఉత్తర్వులు జారీ చేశారు. వారు ఈ పదవిలో రెండేళ్ల పాటు ఉంటారు. వీరు స్టేషన్ రైల్వే సేవలు మెరుగుపరడానికి తగిన సూచనలు ఇస్తారు.

పదవికి వన్నె తెచ్చేలా పనిచేస్తా : నరసింహయాదవ్

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం) టీడీపీ అభివృద్ధికి నిరంతరం కృషి చేశానని, రాష్ట్ర యాదవ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన గొల్ల నరసింహ యాదవ్ అన్నారు. సోమవారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. యాదవ కార్పొరేషన్ చైర్మన్‌గా యాదవ సామాజిక వర్గానికి మేలు చేయాలనే ఆలోచన ఉందని, దీనికి ఉన్నతాధికారులు తగిన సహకారాన్ని అందించాలని ఇప్పటికే కోరానన్నారు. జర్నలిస్టు సోదరులకు హౌసింగ్ ద్వారా ఇళ్లను కేటాయించడానికి ప్రత్యేక లక్ష్యంగా పనిచేస్తానన్నారు. ఈ సమావేశంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి పుష్పావతి యాదవ్, దంపూరు భాస్కర్ యాదవ్, యాదవ సంఘం నాయకులు కట్టా జయరాం యాదవ్, సుబ్బుయాదవ్, రామారావు తదితరులు పాల్గొన్నారు.

గురునాధంకు ఘన సన్మానం

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: సత్యవేడు నియోజకవర్గ పరిధిలోని, బుచ్చినాయుడు కండ్రిగ మండలంలో వైసీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన ఉగ్గుమూడి గురునాధంను ఆ పార్టీ మండల అధ్యక్షులు కొణతనేని మణి నాయుడు ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సత్యవేడు నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త నూకతోటి రాజేష్, బీరేంద్ర రాజు, బాను ప్రకాష్ రెడ్డిలు హాజరయ్యారై గురునాధంను అభినందించారు. ఈ కార్యక్రమంలో వరదయ్యపాలెం మండల అధ్యక్షులు దయాకర్ రెడ్డి, తిలక్ బాబు, దామోదర రెడ్డి, చిన్నా, మహేంద్ర, వినోద్, భాస్కర్, ఎంటెక్ బాబు వైపీపీ రాష్ట్రా, జిల్లా, నియోజకవర్గ నాయకులు, మండల నాయకులు, వైస్ ఎంపీపీ బాబురెడ్డి మాజీ ఎంపిపి మాణికల వెంకటమ్మ, సీనియర్ నాయకులు సాయి నాయుడు, కోటేశ్వరరావు, జయచంద్రనాయుడు, మాజీ సర్పంచ్ గురవయ్య, ప్రసాద్ పాల్, బి.దశకుమార్, వెంకటాద్రి, దినకర్ బాబు, కృష్ణయ్య, చంద్ర, కేశవులు, మిథున్ రెడ్డి ఫాలోవర్ కిరణ్ యాదవ్, కార్యకర్తలు, యువ నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఆర్టీసీ డిపో అసిస్టెంట్ మేనేజర్ ఉద్యోగ విరమణ

ప్రజాశక్తి-వెంకటగిరి టౌన్ : ఆర్టీసీ డిపోలో అసిస్టెంట్ మేనేజర్‌గా పనిచేస్తున్నటువంటి కె.శివాజీ రిటైర్మెంట్ ఫంక్షన్ వెంకటగిరి ఆర్టీసీ డిపోలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్మమంలో పెద్దయ్య, ఎస్.డబ్ల్యు.ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి క్రిష్ణా రావు, సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు వడ్డిపల్లి చెంగయ్య, జోనల్ కార్యదర్శి సి.బాస్కర్, రీజనల్ అధ్యక్షులు మల్లికార్జున్, రాష్ట్ర ఉపాధ్యక్షులు పరుశురాం ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు ఎం.ఆర్.రెడ్డి, వి నరసింహారెడ్డి, వెంకటగిరి డిపో ఎస్డబ్ల్యుఎఫ్ సెక్రటరీ ఆర్.కృష్ణయ్య, నాయకులు ఉదయ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

రంజాన్ వేడుకల్లో చెవిరెడ్డి మోహిత్ రెడ్డి

ప్రజాశక్తి - రామచంద్రాపురం (తిరుపతి రూరల్) తిరుపతి రూరల్ మండలం, కుంట్రపాకం పంచాయతీ, నాగూర్‌కాలనీలో రంజాన్ సంబరాలు మిన్నంటాయి. సోమవారం రంజాన్ పర్వదిన వేడుకల్లో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి చెవిరెడ్డి మోహిత్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మూలం చంద్ర మోహన్‌రెడ్డి, వైస్ ఎంపీపీలు మాదవరెడ్డి, యశోద, వైసీపీ నేతలు చెవిరెడ్డి రఘునాథరెడ్డి, భూను ప్రకాష్‌రెడ్డి, గణపతిరెడ్డి, చిన్నియాదవ్, సెల్వం, కోటి, వెంకటరమణ, రాజ, మన్నూరు శివలతో పాటు స్థానిక మైనారిటీ నాయకులు పాల్గొన్నారు.

ఒంటిమిట్ట శ్రీరామనవమి బ్రహ్మోత్సవాల పనుల పరిశీలన

ప్రజాశక్తి - తిరుపతి సిటి : ఒంటిమిట్టలో ఏప్రిల్ 5 నుండి 15 వరకు జరగనున్న శ్రీరామనవమి బ్రహ్మోత్సవాల పనులను టిటిడి జేఈవో వీరబ్రహ్మం పరిశీలించారు. కడప జిల్లా కలెక్టర్ శ్రీధర్, ఎస్పీ ఈ జీ అశోక్ కుమార్ లతో కలసి సోమవారం కల్యాణ వేదిక ప్రాంగణాన్ని టిటిడి జేఈవో పరిశీలించారు. ఏప్రిల్ 11న ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కడప ఎయిర్‌పోర్టు నుంచి ఒంటిమిట్ట కల్యాణ వేదిక ప్రాంగణానికి చేరుకుంటారని తెలిపారు. ఈ సమావేశంలో టిటిడి సీఈ సత్యనారాయణ, ఎస్ఈలు వేంకటేశ్వర్లు, మనోహర్, కడప ఆర్డీవో జాన్ ఎర్విన్, జమ్మలమడుగు ఆర్డీవో సాయి శ్రీ పాల్గొన్నారు.